# చెర

నవంబర్ నెలలో ఒకరోజు...

ధర్మారం ఊళ్లో వరిపొలాలన్నీ కోతకొచ్చాయి.

వ్యవసాయ కూలీలకు బోల్డు డిమాండ్ యేర్పడింది.

వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగే రోజుల్లో ఆ ఊళ్లో వ్యవసాయ కూలీలకు విపరీతమైన కొరత యేర్పడుతుంది.

కూలీలకు చెల్లించే కూలీరేటు కూడా పెరుగుతుంది.

రోజంతా వరిపొలం కోసినందుకు ప్రతిఫలంగా ఆ పొలం యజమానిచ్చిన కూలిగింజల్ని నెత్తిన పెట్టుకుని, చుట్టూ చీకట్లు ముసురుకుంటుండగా ఊరివైపు బయల్దేరారు సమ్మయ్య, అతని భార్య రాజమ్మ, మరికొందరు ఇతర కూలీలు.

వాళ్లిద్దరూ ఇల్లు చేరుకోగానే కంచంముందు కూర్చుని ఆవురావురుమని అన్నం తింటున్న వాళ్ల కొడుకు సాంబయ్య కనిపించాడు – కొడుకును చూడగానే సమ్మయ్య తన నెత్తిమీదున్న వడ్లబస్తాను కోపంగా నేలమీద పడేసి –

''పైసా సంపాయించే తెలివిలేదుగాని గిన్నెనిండా బువ్వమాత్రం గావాలె'' అన్నాడు కాండ్రించి ఉమ్మేస్తూ.

''కొలువుకని పట్నంలో తిరిగి తిరిగి గిప్పుడే వచ్చి గింత తింటూండేమో... వాణ్ణి ఇప్పుడే మనకు'' అంది రాజమ్మ కొడుకు అన్నం తినకుండానే లేచిపోతాడేమోనని విలవిల్లాడిపోతూ.

''పట్నంల గివీనికి కొలువెవ్వడిత్తడే! పెద్ద పెద్ద చదువులు సదివినోళ్లకే కొలువుల్లేక తిరిగి తిరిగి ఛస్తాంటే... గీడు పనికోసం పట్నం బోవాల్నా? ఊళ్లో ఆసాములంతా కూలికొస్తావా... కూలికొస్తవా అని ఇల్లిల్లూ తిరుగుత లేరు?'' వీని తోటోల్లంతా కూలికిపోయి రోజుకు గుంచెడడ్డెడు వడ్లు తెచ్చుకుంటలేరు?'' అన్నాడు సమ్మయ్య.

''అందరోలె వాడు కూలి చేసుకుంటే గింత లొల్లెందుకుంటది – చిన్ననాటినుంచే ఆడు కూలంటే తప్పించుకునేది గిప్పుడు చెయ్యమంటే చేస్తడా!'' అంది రాజమ్మ

''చెయ్యకుంటెట్ల గావాలెమళ్ల... కడుపులకు బువ్వెట్ల దొరుకుతది'' అన్నాడు సమ్మయ్య.

''గంతో గింతో సదువుకున్నాడు. యేదన్న కొలువు సంపాయించుకుంటడు'' అంది రాజమ్మ.

''సదువుకున్నడు... సదువుకున్నడంటావు - యేం సదువుకున్నడే? ఏపది సదివిండేమొ. ఇయ్యాళ్ళ రేపుకుక్కలు - నక్కలు కూడా సదువుతున్నాయా సదువు. గీనికన్న చానా పెద్ద చదువులు సదివినోళ్లకే కొలువుల్లేవు. గీనికి ఎవడిత్తడే. నువ్వూ, నేనూ తెచ్చిపెడ్తంటే బాగా తిని వంటికి కావరమొచ్చి పట్నం షికార్లు కొట్టొస్తాండు. థూ సిగ్గు! శరం లేదురా ఇన్నేళ్లొచ్చిన - అయ్యా అవ్వ రెక్కల కష్టంతో బతకటానికి'' అంటూ సమ్మయ్య మరోసారి కాండ్రించి ఉమ్మేశాడు.

అంతసేపూ నిశ్శబ్దంగా అన్నం తింటున్న సాంబయ్య కంచంమీంచి దిగ్గున లేచి బయటకెళ్ళి చెయ్యి మూతి కడుక్కున్నాడు.

''నీ కోపం పాడైపోను. బువ్వతినేటోన్ని తినకుండా జేస్తివి. కొడుకు ఎంత ఆకలితో వచ్చిండో ఎంత కోపమొచ్చినా ఎవడన్నా కొడుకు కడుపుమీద కొడ్తడయ్యా? యేం మనిషివయ్యా వానికి నీ కష్టమేం పెట్టొద్దు, నోటికొచ్చినట్టు తిట్టొద్దు. మళ్ళెప్పుడన్నా వాన్ని నువ్విట్ల తిడ్తివో నేను, ఆడు నీ ఇంట్లనుంచి యెళ్లిపోతాం'' అని కన్నీళ్ళు పెట్టుకుంటూ రాజమ్మ అంటుండగానే సాంబయ్య ఇంటినుంచి బయటకొచ్చి బజార్లో పడ్డాడు.

అన్నం మీంచి లేచి విసురుగా బయటకొచ్చిన సాంబయ్యక్కూడా కన్నీళ్లు ఆగడం లేదు.

విషం తాగో, వంటిమీద గ్యాసునూనె పోసుకునో తను వెంటనే చచ్చిపోతే బావుండు ననిపించిందతనికి.

అయ్యన్నమాట నిజమే. తను అయ్య అవ్వల కష్టమే తింటున్నాడు. తను అందరోలె కూలినాలి చేసుకుని బ్రతకలేకపోతాండు. తనకు బుద్ధి తెలిసినప్పటినుంచి మంచిగా బతకాల్నని. మంచి బట్టలు కట్టుకోవాల్నని! ముంచింట్ల ఉండాల్నని కోరిక.

తను పదో తరగతి పాసయ్యిండు. అప్పట్నించే యేదన్న ఉద్యోగం దొరుకుతుందని ఆశ - యే ఆఫీసులోనన్న అటెండర్ పోస్టు సంపాయించుకోవాల్నని ఆరాటం - అందుకే రోజూ 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న పట్నానికి నడిచి పోయ్యొస్తున్నాడు. ఎంప్లాయిమెంట్ ఆఫీసు చుట్టూ తిరుగుతాండు.

పట్నంలో తనకు బాగా తెలిసిన ప్రకాశరావుగారున్నారు. ఆయన యూనివర్శిటీలో పెద్ద ప్రొఫెసర్. ప్రకాశరావుది ధర్మారమే. అప్పుడప్పుడు వచ్చి పోతుంటాడు. ఆయన ఇదివరకు తన ఊరివాళ్లకో ఇద్దరి ముగ్గురికి ఉద్యోగాలిప్పించిండట. వాళ్లళ్ళ ఒకడు బుచ్చయ్య. రెండు మూడు నెలల కిందటే బుచ్చయ్య తనకు దోస్తయిండు. ప్రకాశరావే తనకు యూనివర్శిటల అటెండర్ పోస్టు ఇప్పించిండని చెప్పిండు.

ప్రకాశరావు ధర్మారం వచ్చినప్పుడల్లా తను వెళ్లి కలుస్తాండు. పట్నం కూడా తను

ప్రకాశరావు గారింటికి బోయి కలుస్తనే వున్నాడు.

''పట్నంల నాకేదన్న ఉద్యోగం ఇప్పించుండ్రి దొరా'' తను.

''యేం ఉద్యోగం జేస్తువురా'' - ప్రకాశరావుగారు.

''యేదన్న ఇప్పించుండ్రి. మనూరి బుచ్చయ్యకు మీరే ఇప్పించిండ్రట. నాక్కూడా గట్లాంటిదే ఏదన్నా ఇప్పించుండ్రి'' తను.

''వాడికేదో లక్కీగ దొరికిందిరా.... దాంట్ల నేను జేసిందేం లేదు. అయినా చూద్దాంలే. నువ్వు టెన్త్ పాసయ్యినవుగదా. యేదన్నా ఛాన్స్ వస్తే బుచ్చయ్యలాగే నిన్నుకూడా యూనివర్శిటీలో పడేస్తాను'' - ప్రకాశరావు.

''మరచిపోకుండ్రి దొరా'' - తను.

* * *

ఇంట్లోంచి బయటికొచ్చిన సాంబయ్య బజార్లన్నీ తిరిగి ఊరి బయట పంచాయతీ బోర్డు ఆ దగ్గరకొచ్చే రేడియోలో తెలుగు వార్తలు ప్రసారమవుతోంటే వింటూ కూర్చున్నాడు.

సాంబయ్యకు ప్రకాశరావుమీద చాలా నమ్మకం కుదిరింది. అతనికి ప్రకాశరావు చాలా మంచివాడిలా, దేవుడిలా కనిపించసాగాడు. ఒక్క సాంబయ్యే కాదు ఆఊళ్లో అందరూ ప్రకాశరావును చాలా మంచివాడనే చెప్పుకుంటారు.

బాగా డబ్బు, హోదా, పలుకుబడి ఉన్నవాళ్లలో కనిపించేగర్వం గానీ, దర్పంగానీ ప్రకాశరావులో బొత్తిగా కనిపించవు. పట్నంనుంచి ఊరికొచ్చినప్పుడల్లా ఆఊళ్లో అందరితో ధనిక, పేద అన్న వ్యత్యాసం లేకుండా అందర్నీ చాలా ఆప్యాయంగా పలకరించేవాడు. అందరితోనూ చాలా కలుపుగోలుగా ఉండేవాడు. అతనికి పేదవాళ్లంటే ఒక ప్రత్యేకమైన అభిమానం ఉండేదని, ఏమాత్రం అవకాశం ఉన్నా వాళ్లకు సహాయం చేస్తాడని సాంబయ్యకు బుచ్చయ్య ఎన్నోసార్లు చెప్పాడు.

సాధారణంగా ఉద్యోగాలిప్పించే వాళ్లు ఎంతో డబ్బు తీసుకునిగాని ఉద్యోగాలిప్పించరు. అలాంటిది ప్రకాశరావు బుచ్చయ్యకు ఉద్యోగమిప్పించినందుకు ఒక్కపైసా కూడా తీసుకోలేదని తెల్సినప్పుడు ఆ ఊళ్లో అందరికీ ప్రకాశరావుమీదున్న గౌరవం, ఇంకా ఎన్నోరెట్లు పెరిగింది.

సాంబయ్యకు చిన్నప్పట్నించి పల్లెటూరి జీవితం నచ్చేది కాదు. పొద్దుట్నుంచీ, సాయంత్రం వరకూ పొలాల్లో రెక్కలు ముక్కలు చేసుకొని పనిచేసే వ్యవసాయ కూలీల జీవితం అంటే కూడా అతడు అసహ్యించుకునేవాడు. తన అమ్మా, నాన్నల్లాగా తను కూడా - ఒక వ్యవసాయ కూలీగా మారకూడదని సాంబయ్య కొంచెం బుద్ధి తెలియగానే చాలా దృఢంగా నిర్ణయించుకున్నాడు.

సాంబయ్యకు యేడెనిమిదేళ్ళ వయస్సు రాగానే వాళ్లతండ్రి అతన్నో పెద్ద రైతు దగ్గర పశువుల్ని కాయటానికి జీతం వుంచాడు. కాని సాంబయ్య ఆ పని రెండు మూడురోజులకంటే ఎక్కువ రోజులు చెయ్యలేకపోయాడు. ఆ పన్లోంచి పారిపోయి స్కూల్లో చేరాడు. అతన్ని వాళ్ల తండ్రి బారినుండి తల్లి రాజమ్మ రక్షించింది. ఆమె మొగుడితో పెద్ద గొడవ పెట్టుకొని కొడుకును స్కూల్లో వేసింది. ఆ స్కూల్లో పనిచేసే ఒక టీచరు సాంబయ్య మీద జాలిపడి ఆ కుర్రాడ్ని తనింట్లోనే వుంచుకుని చదివించాడు. ఆ టీచర్ బ్రహ్మచారి కావటంవల్ల ఇంటి పనులు చేసుకోవడంలో సాంబయ్య అతనికి తోడ్పడ్డాడు. మంచినీళ్ల బావికెళ్లి మంచినీళ్లు తెచ్చిపెట్టడం, అంట్లు తోమటం, టీ చెయ్యటం, ఇల్లు ఊడ్వటం, వంట చెయ్యటం, బట్టలుతకటం మొదలైన పనులన్నీ చెయ్యటం సాంబయ్యకు తిండి, బట్టలు, పుస్తకాలు మొదలైనవన్నీ సమకూర్చాడు.

సాంబయ్య యేడోతరగతి వరకు చదువుకున్నాక ఆ టీచర్‌కు ఆ ఊరినుండి ట్రాన్స్‌ఫర్ అయ్యింది. కాని అతడు సాంబయ్యను వదిలెయ్యలేదు. సాంబయ్యను దగ్గర్లోనే వున్న సిటీకి తీసికెళ్లి ఎనిమిదవ తరగతిలో జాయిన్ చేయించటమే కాకుండా సోషల్ వెల్ఫేర్ వాళ్ల హాస్టల్లో కూడా అతనికి ఆశ్రయం కల్పించాడు.

సాంబయ్య అలా పదో తరగతి వరకు చదువుకున్నాడు. ఒకసారి ఫెయిలయినా, సబ్జెక్టులు రాసి రెండోసారి పాసయ్యాడు. సాంబయ్య ఆ తర్వాత కూడా చదవాలని ప్రయత్నించాడు. కాని అతనికి ఇంటర్మీడియెట్లో సీటు దొరకలేదు. ఈలోగా అతనికి బుచ్చయ్యతో పరిచయమైంది.

బుచ్చయ్య కూడా సాంబయ్యలాగే వ్యవసాయ కూలీల కుటుంబానికి చెందినవాడు. అతనిలాగానే బుచ్చయ్య కూడా ఎన్నో అడ్డంకుల్ని అధిగమించి పదో తరగతి పాసయ్యాడు. ప్రకాశరావును ఆశ్రయించి ఉద్యోగం సంపాదించాడు. దాంతో బుచ్చయ్య పరిస్థితి అద్భుతంగా మారిపోయింది. అతనికి కాస్త ఉన్నవాళ్లే. మంచి కట్నం ఇచ్చి కాస్త అందంగా ఉన్న అమ్మాయినే ఇచ్చి పెళ్లిచేశారు. బుచ్చయ్య వెంటనే పట్నంలో కాపురం పెట్టేశాడు. చాలా మంచి బట్టలు వేసుకోవడం మొదలెట్టాడు. ఓ సైకిల్ కొనేశాడు. ఊళ్లో అందరూ బుచ్చయ్యను ఎంతో గౌరవంగా చూడటం మొదలెట్టారు.

రెండుమూడుసార్లు సాంబయ్య సిటీలో బుచ్చయ్య అద్దెకుంటున్న ఇంటికి వెళ్లాడు. అతనికి ఆ ఇల్లు, ఆ వాతావరణం ఎంతో నచ్చింది. బుచ్చయ్య భార్య అతనికి టీ తెచ్చిచ్చింది. అతని కళ్లకు ఆ అమ్మాయి చాలా గొప్పింటి అమ్మాయిలా కనిపించింది. ఆ ఇంట్లో ఉన్న వస్తువుల్ని చూస్తే వాళ్లుచాలా గొప్పవాళ్లయి పోయారనిపించింది.

అకస్మాత్తుగా బుచ్చయ్య పరిస్థితి అంతగా మారిపోవటానికి కారణం అతనికి ఉద్యోగం దొరకటమేనని సాంబయ్యకు అర్థమైంది.

బుచ్చయ్యకు పెద్ద పనేం వుండదని కూడా సాంబయ్య కర్థమైంది. ఒకరి దగ్గరనుండి మరొకరి దగ్గరకు ఫైళ్ళు తీసుకుపోవడమే పని, నెలకు ఆరువందల రూపాయలు... ఆపైన

కూడా కొన్ని దొరుకుతాయని బుచ్చయ్య సాంబయ్యకు చాలా గర్వంగా చెప్పాడు.

బుచ్చయ్యలాగే తనూ ఎన్ని కష్టాలు పడైనా సరే ఉద్యోగం సంపాదించాలని సాంబయ్య దృఢంగా నిర్ణయించుకున్నాడు. తన చిన్నప్పట్నుంచి తన అయ్యా అవ్వల్ని వాళ్లతోపాటు పనిచేస్తున్న ఎంతోమంది వ్యవసాయ కూలీల్ని చూస్తున్నాడు. పది పదిహేనేళ్లుగా వాళ్ల పరిస్థితి ఏమీ మారలేదు. అవే గుడిసెల్లో వుంటున్నారు. అవే బట్టలు కడుతున్నారు. అదే తిండి తింటున్నారు. అవే తిట్లూ తింటున్నారు - తనుకూడా వాళ్లల్లో కలిసిపోకూడదు. తను ఆ పరిస్థితులనుంచి దూరంగా వెళ్లిపోవాలి. మంచి ఇల్లు, బట్టలు, మంచి తిండి, అందమైన భార్య పదేపదే సాంబయ్య వీటిని గూర్చి కలలు గనటం మొదలెట్టాడు.

తన కలలు నిజం కావాలంటే తను ప్రకాశరావును మెప్పించాలి. అతని కరుణను సంపాదించలా. అందుకే ఐదారు నెలలు అతడు సాధ్యమైనన్నిసార్లు సిటీకెళ్లి ప్రకాశరావును కలిసొస్తుండేవాడు. ఎప్పుడు వెళ్లినా ''చూద్దాం - ఇప్పుడైతే యేం పోస్టుల్లేవు. వచ్చినప్పుడు చూద్దాం'' అనేవాడు. అతను వెళ్లినప్పుడల్లా ప్రకాశరావు భార్య చిల్లర మల్లర పనులు చాలా చెబుతుండేది. ఆమె చెప్పిన పనులన్నీ ఎంతో ఓపిగ్గా చేస్తుండేవాడు.

త్వరలోనే తన అదృష్టం ఫలిస్తుందని, సిటీకి రమ్మనే ప్రకాశరావు పిలుపు త్వరలోనే వస్తుందని సాంబయ్య వెయ్యికళ్లతో ఎదురుచూడసాగాడు.

ఈ మధ్య సాంబయ్యకు వాళ్ల తండ్రి సమ్మయ్య పెద్ద సమస్యయి పోయాడు. మొదట్లో తన కొడుకు అంతో ఇంతో చదువుకున్నాడు. కాబట్టి యేదన్నా ఉద్యోగం దొరుకుతుందేమో ననుకునేవాడు సమ్మయ్య. కాని రోజులు గడుస్తున్నకొద్దీ అతనిలో ఆ నమ్మకం సడలి పోసాగింది.

సాంబయ్య యే పనీ చెయ్యకుండా ఊరికినే కూర్చుని తినటాన్ని, ఇష్టమొచ్చినప్పుడల్లా సిటీకి వెళ్లిరావటాన్ని సమ్మయ్య సహించలేకపోయాడు. అతనికి కోపమొచ్చినప్పుడు అతని నోటివెంట బూతుమాటలు ప్రవాహంలా వెలువడేవి. తండ్రి తిట్టే ఆ తిట్లకు సాంబయ్య బాధతో విలవిల్లాడిపోయేవాడు. అతని రక్తం వేడెక్కి సలసలా మరిగిపోయేది - ఆవేశంతో ఉక్కిరిబిక్కిరై పోయేవాడు - ఒక్కొక్కసారి ఆ తండ్రికి ఎదురుతిరిగి చితకబాదాలనిపించేది. కాని తనను తాను కంట్రోల్ చేసుకొని వెంటనే ఇంట్లోంచి బయటకెళ్లిపోయేవాడు. సాధ్యమైనంత వరకు తండ్రిని తప్పించుకొని తిరగటం అలవాటు చేసుకున్నాడు.

* * *

పంచాయితీ బోర్డు ఆఫీసు దగ్గర గుమిగూడిన ఆ ఊరి యువకులంతా ఒక్కొక్కరే వాళ్లవాళ్ల ఇళ్లవైపు వెళ్లిపోసాగారు. సాంబయ్య క్కూడా ఇంటికెళ్లాలనిపించింది. రేడియోలో ఇంగ్లీషు వార్తలొస్తున్నాయి. తొమ్మిది గంటలైపోయింది.

''అయ్య గిప్పటిదాకా మేల్కతోనుండడు. ఎప్పుడో నిద్రపోయుండ్రా'' అనుకొని సాంబయ్య లేచి ఇంటివైపు బయలుదేరాడు.

వాళ్లింటి ముందున్న తడకను తోసుకొని లోపలకెళ్లగానే వాళ్లమ్మ బయటకొచ్చి గుసగుసగా చెప్పింది.

''నిన్ను ప్రకాశరావు దొర రమ్మన్నడ్రా...''

ఆ మాట వినగానే సాంబయ్యకు ఎగిరి గంతెయ్యాలన్నంత ఉత్సాహం కల్గింది.

''ఎవరొచ్చి చెప్పిండ్రే?'' అన్నాడు సాంబయ్య.

''వాళ్ల జీతగాడు రాముడొచ్చి చెప్పిండు. నువ్వు గప్పుడే బయటికి పోతివి''

ప్రకాశరావు దగ్గర్నుంచి తనకు పిలుపొస్తున్నప్పుడే తను ఇంట్లో లేకపోయినందుకు సాంబయ్యకు తనమీద తనకు విపరీతమైన కోపమొచ్చింది. ఎంతకాలంగానో ఊపిరి బిగపట్టుకుని ఎదురుచూస్తున్న ఆ మహదావకాశం వచ్చినట్టే వచ్చి తన కందకుండా పోతుందేమోనని వణికిపోయాడతడు. వెంటనే ప్రకాశరావింటికి బయల్దేరాడు.

''గింత రాత్రిపూటేం బోతవురా – పొద్దుగాల పోదువులే'' అంటున్న వాళ్లమ్మ మాట వినిపించుకోకుండానే అతడు బజార్లోకి పరుగెత్తుతున్నట్లుగా నడవసాగాడు.

తనకు తెలుసు... ప్రకాశరావు గారింట్ల పొద్దుగూకంగనే పండుకోరు. పదింటిదాకా వాళ్లింట లైట్లు వెలుగుతునే వుంటయి.

సాంబయ్య ప్రకాశరావింటిని సమీపించాడు. అతడు అనుకున్నట్టు గానే వాళ్లింట్లో లైట్లు వెల్గుతునే వుంటయి.

సాంబయ్య లోపల అడుగుపెట్టగానే బయట హాల్లో కూర్చుని తన బావలతోను, చెల్లెళ్లతోను మాట్లాడుతున్న ప్రకాశరావు కనిపించాడు. చాలామంది బంధువులతో ఇల్లంతా చాలా సందడిగా ఉంది.

సాంబయ్యను చూడగానే ప్రకాశరావు వాళ్ల మధ్యలోంచి లేచి బయటకొచ్చాడు. సాంబయ్య వెంటనే అతనికి నమస్కారం చేశాడు.

''యేంరా సాంబా! బాగున్నావా?'' అన్నాడు ప్రకాశరావు.

బాగానే వున్నట్టుగా తలూపాడు సాంబయ్య.

''చాలాసేపట్నుంచి నీకోసమే చూస్తున్న ఇంట్లో లేవట కదా... ఎక్కడికెళ్లావ్?''

''గప్పుడే బయటికి బోయిన దొరా...''

కాస్సేపు నిశ్శబ్దం. ప్రకాశరావు యేం చెబుతాడో విందామన్న ఆతురతతో అతని గుండెలు అతి వేగంగా కొట్టుకోసాగాయి.

''నీ ఉద్యోగం గురించి చాలా ప్రయత్నం చేస్తున్నావురా! యూనివర్శిటీలో వి.సికీ, రిజిస్ట్రారుకు చెప్పిపెట్టాను. ఈ మధ్యనే రెండు మూడు అటెండరు పోస్టులు వస్తున్నాయని చెప్పాడు. అవి యే క్షణానైనా రావచ్చు. తీరా అవి వచ్చినప్పుడు నేను సిటీలో లేకపోవడం నీకు కబురు చెయ్యకపోవటం లాంటి పరిస్థితి ఏర్పడటం జరిగితే నువ్వు చాలా బాధపడి

పోతావ్. అందుకని నువ్వొక పనిచెయ్యి. రేపు నువ్వుకూడా మాతోబాటే సిటీకొచ్చేసి మా ఇంట్లోనే ఉండు. ఎప్పుడు అవకాశమొస్తే అప్పుడు నిన్ను యూనివర్శిటీలో పెట్టిస్తాను..'' అన్నాడు ప్రకాశరావు.

సాంబయ్య తన చెవుల్ని తాను నమ్మలేకపోయాడు. తను యెదురుచూస్తున్న ''మహత్తర క్షణం ఇంతత్వరగా వస్తుందని అతడు ఊహించలేదు. తను జరుగుతుందని ఆశిస్తున్న ఆ మహాద్భుతం ఇంత త్వరగా జరుగుతుందని అతడు అనుకోలేదు. వెర్రి ఆనందంతో పొంగిపోతున్న అతని నోటినుండి మాటలు రావటం లేదు.

''యేరా... మాట్లాడవు. రేపు మాతోపాటే సిటీకొస్తావా? లేదా? నీ ఇష్టం... ఇందులో బలవంతం యేమీ లేదు...'' అన్నారు ప్రకాశరావు.

''గట్లంటరేంది దొరా! గిన్ని రోజుల్నించి నేను మీ పిలుపు కోసమే ఎదురుచూస్తుంటిని. మీరు రమ్మనంక రాకపోవుడుంటదా గిప్పుడు రమ్మంటే గిప్పుడే వస్త'' అన్నాడు సాంబయ్య.

''ఇప్పుడెందుగ్గానీ - రేపు పొద్దున్నే ఆరుగంటల వరకు తయారై రా పో - నీకు ఉద్యోగం దొరికేంతవరకు మా ఇంట్లోనే ఉందువుగానీ, మాతోబాటే నువ్వు యింత తిందువుగానీ ఒక్కడికీ ఇంత తిండి పెట్టడం మాకేమంత సమస్య కాదులే -'' అన్నాడు ప్రకాశరావు.

ఆ క్షణంలో ప్రకాశరావు సాంబయ్యకు సాక్షాత్ శ్రీకృష్ణ పరమాత్ముడిలా కనిపించాడు. అతని నీడలో చేరిన తనకిక ఎలాంటి కష్టమూ రాదనుకున్నాడు.

''కోడికూయంగానే లేచొస్త దొరా'' అంటూ సాంబయ్య వాళ్లింటివైపు బయల్దేరాడు.

సాంబయ్య ఇంటికెళ్లి పక్కమీద పడుకున్నాడేగాని నిద్రపోలేకపోయాడు. అతని భావిజీవితం అతనికి సప్త వర్ణాలతో దేదీప్యమానంగా వెలిగిపోతూ కనిపించసాగింది. ఎన్నో కలలు అతని కళ్లల్లో ప్రమిదల్లా వెలిగిపోసాగాయి. అర్ధరాత్రి దాటితేగానే అతనికి నిద్ర పట్టలేదు.

* * *

కోడి కూస్తుండగానే లేచాడు. వాళ్లమ్మతో ప్రకాశరావుదొర తనను రమ్మన్నాడని, ఉద్యోగం ఇప్పిస్తానన్నాడని చెప్పేసి, ఓ చిన్న సంచీలో తన బట్టలు సర్దేసుకుని ప్రకాశరావింటికి పరుగెత్తాడు.

సాంబయ్య ప్రకాశరావింటికి చేరుకొనేప్పటికి ఒక్కొక్కరే లేచి ప్రయాణానికి సన్నద్ధులౌతూ కనిపించారు. సాంబయ్య కనిపించగానే ప్రకాశరావు చెల్లెళ్లు చిన్న చిన్న పనులు చెప్పడం మొదలెట్టారు. సాంబయ్య చాలా ఉత్సాహంగా పనుల్ని చెయ్యసాగాడు.

వాళ్లందరి మాటలు వింటోంటే సాంబయ్యకు వాళ్లంతా ఒకేసారి ఎందుకొచ్చారో,

ఎందుకు పట్నం వెళుతున్నారో అర్థమైంది - ప్రకాశరావు తండ్రి గోవిందరావుకి జబ్బు చేసింది. అతన్ని వెంటనే హాస్పిటల్‌కు తీసుకెళ్లాలని నిర్ణయించారు.

గోవిందరావుకు 80 ఏళ్లయినా ఉంటాయేమో. అంత వయసొచ్చినా మొన్నటిదాకా అతడెంతో ఆరోగ్యవంతుడిలా కనిపించేవాడు. చక్కగా నడుస్తూ వాళ్ల పొలాల దగ్గరకు వెళ్ళొస్తుండేవాడు. ఒకప్పుడు ఆ ఊరంతా ఒక చక్రవర్తిలా పరిపాలించిన గోవిందరావును చూస్తే ఆనాటివాళ్లు ఈనాటికృూడా హడలిపోయేవాళ్లు. అంతటి మనిషి ఈరోజు యేదో తీవ్రమైన జబ్బుచేసి నిశ్చలంగా పక్కమీద పడిపోవటంతో ఆ ఊళ్లో ముఖ్యమైన వాళ్లంతా అతన్ని చూడటానికొచ్చారు.

ఏడుగంటలౌతుండగా ప్రకాశరావింటికి సిటీనుంచి ఒక వ్యాన్ వచ్చింది. దాంట్లోకి మొట్టమొదలు గోవిందరావును ఎక్కించారు. ఆ తర్వాత ప్రకాశరావు వాళ్ల బంధువులంతా ఒకరి తర్వాత ఒకరు ఎక్కి కూర్చున్నారు. పిన్నలు, పెద్దలతో ఆ వ్యానంతా క్రిక్కిరిసి పోయింది. ప్రకాశరావుగారు కూడా యెక్కి కూర్చుని సాంబయ్యను చూసి నువ్వుకూడా వెనకాల ఎలాగో సర్దుకుని కూర్చోరా అన్నాడు. సాంబయ్య అతి కష్టంగా ఆ వ్యాన్లో ఇరికాడు.

గోవిందరావు కూతుళ్ళు కన్నీళ్ళు పెట్టుకోవడం చూస్తే ఆయనకొచ్చిన జబ్బు చాలా ప్రమాదకరమైందే ననిపించింది. ఆయన్ను హాస్పిటల్‌లో జాయిన్ చేయిస్తే, వచ్చేపోయే బంధువులతో చాలా హడావుడిగా వుండే ప్రకాశరావుగారికి తనను గూర్చి ఆలోచించే టైమ్ దొరుకుతుందా. ఈ సందడిలో ఆయనకు తన ఉద్యోగం విషయం గుర్తుంటుందా'' అన్న సందేహం కల్గింది సాంబయ్యకు.

అరగంటలో వ్యాన్ ప్రకాశరావు ఇంటిముందు ఆగింది. అందరూ కలిసి గోవిందరావును కిందకుదించి ఇంట్లోకి మోసుకెళ్ళి పక్కమీద పడుకోబెట్టారు.

డాక్టర్‌ని తీసుకొస్తానని ప్రకాశరావు అదే వ్యానెక్కి బయటకెళ్లాడు.

మళ్లీ ఇంట్లో అందరూ సాంబయ్యకు తలా ఒక పని చెప్పటం మొదలుపెట్టారు.

''అరే సాంబయ్యా! నా సూట్‌కేసెక్కడుందో చూడ్రా'' అని ఒకరంటే ''నేను స్నానం చెయ్యాలి బాత్‌రూంలో నీళ్లు పెట్రా'' అని మరొకరు.

సాంబయ్య అందరి పనులు చకచకా చేసెయ్యసాగాడు. ఇంతలో ప్రకాశరావు భార్య సాంబయ్యను పిలిచి ''మొదలు వంటపని చూడాలిరా - నువ్వు వెంటనే మార్కెట్టుకు వెళ్లి ఈ కూరగాయలు పట్టుకురావాలి'' అని అతని చేతిలో కొంత డబ్బుపోసి ఓ లిస్టు చేతికిచ్చింది.

కూరగాయలు తెచ్చివ్వాగానే అందరికీ టిఫిన్లు, కాఫీలు అందించే పని తగిలింది.

ఈలోగా ప్రకాశరావు డాక్టర్ను తీసుకొచ్చాడు. డాక్టర్ చాలాసేపు గోవిందరావును పరీక్షచేసి ''ఈయనను వెంటనే హాస్పిటల్లో అడ్మిట్ చేయించాలి'' అని సలహా ఇచ్చాడు.

గోవిందరావును మళ్లీ వాన్ ఎక్కించారు. వాన్ స్టార్టవుతోంటే ''సాంబయ్యా! నువ్వుకూడా రా'' అన్నాడు ప్రకాశరావు. సాంబయ్య వెంటనే వ్యానెక్కేశాడు.

అక్కడికి దగ్గరలోనే ఉన్న ఒక ప్రైవేటు నర్సింగ్‌హోమ్‌లో గోవిందరావును చేర్పించారు.

గోవిందరావును బెడ్‌మీద పడుకోబెట్టాక ప్రకాశరావు సాంబయ్యను పక్కకు పిలిచి చెప్పాడు.

''ఒరేయ్ సాంబయ్యా! నీ ఉద్యోగం విషయం నేను చూస్తాను గానీ నువ్వు నాకో సహాయం చెయ్యాలి. నాన్నగారికి ఈ వయసులో పక్షవాతం వచ్చింది. ఆయన కదల్లేకుండా పడిపోయాడు. 24 గంటలు కంటికి రెప్పలా ఆయన్ని నువ్వే కనిపెట్టుకుని ఉండాలి''

సాంబయ్య వెంటనే అలాగే అన్నట్టు తలూపాడు.

సాంబయ్యకు ఆ హాస్పిటల్‌లోని వాతావరణాన్ని చూస్తే చాలా భయమేసింది. రకరకాల జబ్బులతో బాధపడ్తున్న ఆ రోగుల్ని చూస్తే అతని తల తిరిగినట్టయింది. కాని తను ప్రకాశరావు మాట కాదనటానికి వీల్లేదు. ఆయనిప్పుడు తనను నిప్పుల్లో దూకమన్నా కళ్లు మూసుకొని నిస్సంకోచంగా దూకాల్సిందే.

''నేను రేపే మరోసారి మా వైస్ చాన్సలర్‌తో నీ విషయం మాట్లాడతాను. నీకు ఉద్యోగం తప్పకుండా దొరుకుతుంది. డోంట్ వర్రీ...'' అన్నాడు ప్రకాశరావు.

''మీ మేలు ఈ జన్మలో మరువ...'' అంటూ చేతులు జోడించాడు సాంబయ్య.

ప్రకాశరావు వాళ్ల నాన్న దగ్గరికెళ్ళి ''మీ దగ్గర సాంబడుంటాడు. మీకేం అవసరమున్నా వాడికి చెప్పండి. మనవాళ్లు కూడా ఎప్పుడూ ఎవరో ఒకరు మీదగ్గరకు వస్తూనే వుంటారు'' అన్నాడు.

''డాక్టర్ ఏమన్నాడు?'' అన్నాడు గోవిందరావు.

''కొన్నిరోజులు మందులు వాడితే తగ్గిపోవచ్చు అన్నాడు. మీరు ధైర్యంగా ఉండండి'' అంటూ ప్రకాశరావు వెళ్లిపోయాడు.

ఆ క్షణంనుండి సాంబయ్యే ఆ వృద్ధుడికి సర్వస్వమైపోయాడు. అనుక్షణం చంటిపిల్లాడ్ని చూసుకున్నట్టుగా సాంబయ్య ఆ వృద్ధున్ని చూసుకుంటూ అతని అవసరాల్ని తీర్చాడు.

పొద్దున్నే అతన్ని లేపి, కూర్చోబెట్టి మొఖం కడిగించి, పాలు తాగించి, మూతి కడిగి పడుకోబెట్టేవాడు. అతడు ఉమ్మేస్తానన్నప్పుడు ఉమ్మిపాత్ర అందించేవాడు. ఒక్కొక్క బుక్క అన్నం తినిపించేవాడు. నర్స్ చెప్పిన ప్రకారంగా మందులందించేవాడు. అతన్ని చూడటానికొచ్చే వాళ్లందరి పనులు చేసిపెట్టేవాడు. గోవిందరావుకు తెచ్చే అన్నంతోబాటే సాంబయ్యక్కూడా అన్నం తెచ్చేవాళ్లు. ఆ రోగులమధ్య సాంబయ్యకు అన్నం రుచించేది కాదు, రోజూ అర్ధాకలితో ఆ వృద్ధుడి మంచం పక్కనే నేలమీద పడుకునేవాడు. కాని ఆ

వృద్ధుడు అతన్ని ఎంతోసేపు పడుకోనిచ్చేవాడు కాదు - ''సాంబా! సాంబా! అంటూ పిలిచి ఏదో పని పురమాయించాడు. అతడు చెప్పే కొన్ని పనులు చేసేటప్పుడు సాంబయ్యకు తనమీద తనకు విపరీతమైన అసహ్యమేసేది.

గోవిందరావుకు మూత్రం వచ్చినప్పుడు మూత్రం చేసే క్యాన్ అందించమనేవాడు. మంచం కిందున్న ఆ క్యాన్ తీసి దాంట్లో అతడు మూత్రం చేసేట్టుగా సాంబయ్యే పట్టుకోవాలి. అతడు మూత్రం చేశాక దాన్ని తీసికెళ్లి బయట లెట్రిన్‌లో పారబోసి, శుభ్రం చేసుకొని తీసుకురావాలి.

మొదటిసారి ఈ పని చెయ్యాల్సి వచ్చినప్పుడు అతడికి వెంటనే ఆ హాస్పిటాల్లోంచి పారిపోవాలనిపించింది. ఉద్యోగం ఆశలోపడి తనను తాను ఇంతగా దిగజార్చి వేసుకుంటున్నందుకు అతడు తనను తాను క్షమించుకోలేకపోయాడు. కాని అతడు తనను తాను సమాధానపరుచుకొనేవాడు.

ఒక్క నాల్గురోజులు కష్టపడితే తన జీవితం మారిపోతుంది. తను సుఖంగా బ్రతుకుతాడు. తన కలలన్నీ నిజమౌతాయి. తను ఆవేశపడకూడదు. నోటిదాకా వచ్చిన అన్నం ముద్దను కాలదన్నుకోకూడదు...

కాని తను కోరుకుంటున్నది సాధించడానికి ఇంకా ఎంత భయంకరమైన పనులు చెయ్యాల్సి వస్తుందో అతడు ఊహించలేకపోయాడు.

గోవిందరావు హాస్పిటల్లో చేరిన రెండోరోజు అర్ధరాత్రి తన బెడ్ పక్కనే నిద్రపోతున్న సాంబయ్యను -

''అరేయ్ సాంబా'' అంటూ గావుకేక పెట్టి లేపాడు.

యేదో పెద్ద ప్రమాదం జరిగుంటుందని సాంబయ్య దిగ్గునలేచి ''యేంది దొరా'' అన్నాడు.

''నేను దొడ్డికి పోవాల్రా'' అన్నాడు ముసలాయన.

కాళ్లు చేతులు పడిపోయి కదల్లేకుండా వున్న ఆ భారీ విగ్రహం లేచి దొడ్డిదాకా ఎలా వెళ్తుందో సాంబయ్యకర్థం కాలేదు.

''కదల్లేరుగద... దొడ్డికెట్లబోతరు?'' కళ్లు నులుముకుంటూ అన్నాడు సాంబయ్య.

''గక్కడ నర్సుంటది. మా దొరకు దొడ్డికొస్తాంది. యేమన్న ఇస్తరా అని అడిగి తీసుకురాపో. అన్ని తెచ్చిన్రుగాని బెడ్‌పాన్ తేలే. నర్సును అడుగుపో... ఇస్తది'' అన్నాడు గోవిందరావు.

సాంబయ్యకు అతడు చెప్తున్నదేమిటో అర్థం కాలేదు. అందుకే కదలకుండా అలాగే కూర్చున్నాడు.

''ఇంక గట్లనే కూర్చున్నావేందిరా గాడిదకొడకా! దబ్బునపోంయి బెడ్‌పాన్

అడుక్కరాపో'' కసిరాడు ముసలాయన.

''ముసిలోడికి ఇంకా కోపం బాగానే ఉన్నది. చింత చచ్చినా పులుపు చావలే'' అనుకుంటూ సాంబయ్య లేచి ఆ వార్డు చివర్లో టేబుల్ మీద తలపెట్టుకుని నిద్రపోతున్న నర్స్ దగ్గరికెళ్లాడు.

''సిస్టర్... సిస్టర్'' అన్నాడు సాంబయ్య.

ఆమె లేచి యేమిటన్నట్టు చూసింది.

''గా 14 వ నెంబరు పేషెంటు... దొడ్డికి బోతడట''

''దొడ్డికి పోతే తీసుకుపో... నన్నేం చెయ్యమంటావు?'' అందామె విసుక్కుంటూ.

''ఆయనకు కాళ్లు చేతులు పడిపోయినయి... లేవలేడు''

''అయితే బెడ్‌పాన్ పెట్టు''

''గది మీరియ్యండ్రి''

''మేమియ్యం - దాన్ని మీరే తెచ్చుకోవాలి''

''రేపు మా దొరకు చెప్పి తెప్పిస్త... ఇప్పుడొకసారికి మీరియ్యండ్రి''

''అర్ధరాత్రి భలే న్యూసెన్స్ తెచ్చిపెట్టావే - పెరాలసిస్ పేషెంటుకు బెడ్‌పాన్ అవసరముంటుందని మీ దొరకు తెలియదా? బుద్ధిలేదు'' అందామె కోపంగా.

''అరె సాంబా! దబ్బున రారా'' నిద్రపోతున్న పేషెంట్సందరూ లేచేంత బిగ్గరగా అరిచాడు గోవిందరావు.

''పెద్ద దొర పిలుస్తాండు - కాస్త సూసియ్యండ్రి సిస్టర్'' అన్నాడు సాంబయ్య.

''న్యూసెన్స్ అర్ధరాత్రి భలే న్యూసెన్స్ ఛీఛీ'' ఆమె చాలా విసుగ్గా లేచి బెడ్‌పాన్ తెచ్చి అతని చేతికిచ్చింది.

''దీన్ని మళ్లీ శుభ్రంగా ఫినాయిల్‌పోసి కడిగివ్వాలి తెలిసిందా?''

''అలాగే'' నన్నట్టు తల వూపి గోవిందరావు బెడ్ దగ్గరకు నడిచాడు. తెచ్చాడేగాని దాన్ని ఎలా ఉపయోగించాలో సాంబయ్యకు అర్థంకాలేదు.

''గట్ల చూస్తావేందిరా... దాన్ని నా ముడ్డికింద పెట్టు'' అరిచాడు ముసలాయన.

అతని నడుం పట్టుకొని పైకిలేపి అతడు చెప్పినట్టుగా చేశాడు. సాంబయ్య ఆ దృశ్యాన్ని చూళ్ళేకపోయాడు. గట్టిగా కళ్ళు మూసుకున్నాడు.

* * *

తన జీవితంలో తను ఇలాంటి పని చెయ్యాల్సి వస్తుందని కలలో కూడా ఊహించలేదు.

తనక్కణ్ణించి వెంటనే పరుగెత్తుకుని బయటకు వెళ్లిపోవాలి. ఇంత నీచమైన పని చేసేకంటే తను వెంటనే చచ్చిపోవటం మేలు - కాని తను యేమి చెయ్యలేడు. తనక్కూడా పక్షవాతం వచ్చింది. తన కాళ్ళూ చేతులూ పడిపోయ్యాయి. తన శరీరంలోని

రక్తమాంసములు గడ్డ కట్టుకుపోయాయి. అసలు తనే చచ్చిపోయాడు. కేవలం తన శవం మాత్రం మిగిలి ఆ ముసలాయనికీ పనులన్నీ చేసిపెడ్తోంది...

''గట్ల గుడ్లు మిటకరించి చూస్తున్నవేందిరా.... నీళ్లుతెచ్చి కడిగి దీన్ని తీసెయ్'' అన్నాడు ముసలాయన.

మారు మాట్లాడకుండా పైప్ దగ్గరికెళ్లి నీళ్లు తెచ్చి అతని ముడ్డి కడిగాడు.

''గదేం కడుగుడ్రా... మంచిక్కడుగు'' కోపంగా అన్నాడు గోవిందరావు.

సాంబయ్య ముక్కుమూసుకుని ఆ బెడ్‌పాన్ పట్టుకెళ్లి లెట్రిన్‌లో గుమ్మరించేసి దాన్ని పైప్‌కింద పెట్టి శుభ్రం చేసి దాన్ని తెల్లవారాక ఆమె కిచ్చేద్దామని తెచ్చి బెడ్‌కింద పెట్టాడు.

ముసలాయన హాయిగా నిద్రపోతున్నాడు.

కాని సాంబయ్య నిద్రపోలేకపోతున్నాడు.

తననీ దవాఖానాలో ఎవరో బంధించారు. తన కాళ్లూ చేతులు విరగ్గొట్టి తన రక్తమాంసాల్ని పిండేసి తననో కదుల్తున్న శవంగా మార్చేసి అక్కడుంచారు? ఈ చెరలోంచి తనకిక విముక్తి లేదు... ఈ ముసలాడితోటే తనూ చచ్చిపోతాడు. తప్పదు.

లేదు... లేదు... అలా జరగదు. ఇంకొక్క నాలుగు రోజులుంటే తనకీ చెర వదులుతుంది. తన కష్టాలన్నీ తీరిపోతాయి. తన జీవితం ఒక అద్భుతమైన మలుపు తిరుగుతుంది. తనకిప్పుడు కావాల్సింది ఓపిక భూదేవికున్నంత ఓపిక కావాలి. తనిప్పుడు ఎంత చిన్న పొరపాటు చేసినా నోటిదాకా వచ్చిన అమృతం విషమైపోతుంది. తనను బాగా చూడటం లేదని ఈ ముసిలాయన కొడుక్కు చెప్పాడంటే తన బతుకు బండలైపోతుంది. తను ఆ పరిస్థితి తెచ్చుకోకూడదు.

* * *

ఆ మర్నాడు ప్రకాశరావు రాగానే రాత్రి జరిగిన విషయం చెప్పాడు. ఆయన వెంటనే ఎవరినో పంపించి బెడ్‌పాన్ తెప్పించాడు.

''నీచేత ఇట్లాంటి పనులు చేయిస్తున్నందుకు చాలా విచారిస్తున్నారా సాంబయ్యా, ఏమీ అనుకోకు. ఆయన నీక్కూడా తండ్రే అనుకో - నీ కష్టం ఊరికేపోదు. ఒక్క నాల్గురోజులు ఓపికపట్టు. నీకు తప్పకుండా ఉద్యోగం ఇప్పిస్తాను'' అన్నాడు ప్రకాశరావు.

''మంచిద్దొరా!'' అన్నాడు సాంబయ్య.

* * *

ఆ నాల్గురోజులు ఎనిమిది రోజులయ్యాయి. నెలరోజులయ్యాయి. రెండు నెలలయ్యాయి. మూడు నెలలయ్యాయి. కాని సాంబయ్యకు విముక్తి దొరకలేదు.

ప్రకాశరావు, అతని చెల్లెళ్ళూ, అతని భార్య అందరూ హాస్పిటల్ కొచ్చి పోతూనే

ఉన్నారు.

ఉద్యోగ విషయం అడిగినప్పుడల్లా ''నాల్గురోజులు ఓపిక పట్టు - తప్పకుండా ఇప్పిస్తానని ప్రకాశరావు అంటూనే ఉన్నాడు. ఒక్క నాలుగు రోజులు గడిస్తే తనకీ చెర వదులుతుందని సాంబయ్య తనను తాను సమాధాన పరచుకుంటూనే ఉన్నాడు. గోవిందరావుకు అన్నీ తానే అయిపోయి తనీ పనులు చెయ్యగలనని కలలోకూడా ఊహించని పనులన్నీ అతనికి చేసిపెడ్తూనే ఉన్నాడు.

మూడు నెలల తర్వాత గోవిందరావు పరిస్థితి విషమించింది. ఓ రోజు ఉదయం ఆయనకున్న ముఖ్యమైన బంధువులందరి సమక్షంలోనే శాశ్వతంగా కన్నుమూశాడు.

అతని శవాన్ని టాక్సీలో వేసుకుని వాళ్ల ఊరు తీసుకెళ్లారు.

అతని అంత్యక్రియలు చాలా బ్రహ్మాండంగా జరిగాయి. వచ్చేపోయే బంధువులతో ఆ ఊరంతా నిండిపోయింది.

11వరోజు ఉదయం ఆయన కర్మకాండ జరుగుతున్నప్పుడు పట్నంనుంచి ప్రకాశరావు మిత్రులు చాలామందొచ్చారు. ఐదారు కార్లొచ్చాయి. జీపులొచ్చాయి. వ్యాన్‌లొచ్చాయి. పెద్ద పెద్ద పార్టీలు జరిగాయి.

అన్ని రోజులూ సాంబయ్యకు రోజూ రెండు మూడు గంటలు కూడా విశ్రాంతి దొరకలేదు. అంతటా తానే అయి అందరికీ అన్నీ పనులూ చేసిపెట్టాడు.

గోవిందరావు చనిపోయి పన్నెండురోజులు గడిచాక వచ్చిన బంధువులంతా వాళ్లవాళ్ల ఊర్లకు బయల్దేరారు. ప్రకాశరావు కూడా సిటీకి బయల్దేరాడు.

సాంబయ్య తనను కూడా సిటీకి రమ్మంటారనుకొని అన్నీ సర్దుకుని రెడీగా ఉన్నాడు.

వ్యాన్ యెక్కబోతున్న ప్రకాశరావు సాంబయ్యను చూసి ఆగిపోయాడు.

''యేరా సాంబయ్యా నువ్వుకూడా వస్తున్నావా?'' అన్నాడు.

''ఔను దొరా! రావాలెగదా'' అన్నాడు సాంబయ్య.

''అఫ్‌కోర్స్ రావాలనుకో. కానీ ఇప్పుడవసరం లేదు. నాల్గురోజులు పోయాక వద్దువుగానీ నిన్న ఇక్కడకు వైస్‌చాన్సలర్, రిజిస్ట్రార్ - అందరూ వచ్చారు. నీ విషయం గుర్తుచేశాను. రెండు అటెండర్ పోస్టులు వెళ్లాయట. కానీ యేం లాభం! అవి రెండూ షెడ్యూల్డు కాస్ట్ వాళ్లకే కేటాయించారట. నువ్వు షెడ్యూల్డు కాస్ట్ కాదుగదా?'' అన్నాడు ప్రకాశరావు.

తన నెత్తిమీద యేదో పెద్ద రాతిబండ పడ్డట్టు - మెత్తని కత్తితో ఎవరో తన తలను నరికేస్తున్నట్టు - తన కాళ్ళూ చేతులూ కట్టేసి తన నెవరో బావిలో ముంచేస్తున్నట్టు - తన కళ్లలో ఎవరో కారం చల్లుతున్నట్టు -

సాంబయ్య నోట్లోంచి మాట రావడం లేదు... యే క్షణంలోనైనా తన కాళ్ళు

పట్టుదప్పిపోయి తను అక్కడికక్కడే భూస్థాపితం అయిపోవచ్చుననిపించిందతనికి.

''పోనీయ్ నువ్వు ఒక పని చెయ్యగలుగుతావా?'' అన్నాడు ప్రకాశరావు.

యేమిటన్నట్టు చూశాయి సాంబయ్యకళ్లు.

''నువ్వే షెడ్యూల్డు కాస్ట్ సర్టిఫికెట్ సంపాదించగలవా?''

'దింపుడు కళ్లెం ఆశంటే ఇదేనేమో' అనిపించింది సాంబయ్యకు.

''దొంగ సర్టిఫికెట్ నాకెందుకు దొరా!'' అన్నాడు కన్నీటితో కంఠం పూడుకుపోతోంటే.

''ఎందుకలా బాధపడిపోతున్నావురా! ధైర్యంగా ఉండు. ఒక్క నాలుగురోజులు ఓపికపట్టు. ఈసారి అటెండర్ పోస్టులు వెళ్లినప్పుడు నీకు తప్పకుండా ఇప్పిస్తాను. ఈలోగా ఊళ్లో ఏదన్నా పనిచేసుకో. నీలాంటి ఏబుల్ బాడీడ్ యంగ్‌మ్యాన్‌కు పని దొరకకపోవటమేమిటి?'' అన్నాడు ప్రకాశరావు వ్యానెక్కుతూ.

మరుక్షణంలో వ్యాన్ స్టార్టయి వెళ్లిపోయింది.

ప్రకాశరావు మాటలు సాంబయ్య బుర్రలో మార్మోగుతుంటే అతని కళ్లకు చీకట్లు క్రమ్ముతుంటే పొలాలవైపు కదిలిపోతున్న కూలీలు కనిపించారు.

వాళ్లల్లో చేరిపోవటమో - లేక పట్నం వెళ్లి యే లారీకిందనైనా పడి శాశ్వతంగా ఈ భూలోకానికి గుడ్‌బై చెప్పెయ్యటమో - వెంటనే తేల్చుకోలేకపోయాడు సాంబయ్య.

★

ఆంధ్రజ్యోతి వారపత్రిక 1987